Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# కోస్తాంధ్రలో భారీ వర్షం

- నీట మునిగిన పలు పంటలు
- నేలవాలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు
- కెకెలైన్‌లో విరిగిపడిన కొండచరియలు
- 22న అల్పపీడన : విపత్తు నిర్వహణ సంస్థ



**విశాఖపట్నం, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ గుంటూరు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి, విశాఖలో భారీ వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంకాలం వరకూ చిరు జల్లులు పడ్డాయి. విజయనగరం జిల్లా మెరకముడిదాంలో 43.7 మిల్లీ మీటర్లు, అన్నమయ్య జిల్లా గాలివీడులో 43.2 మిల్లీ మీటర్లు, విజయనగరం జిల్లా గొల్లపాడులో 43 మిల్లీమీటర్లు, పాడేరులో 41 మిల్లీ మీటర్లు, అల్లూరి జిల్లా కాకరపాడులో 39.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లో కొండచరియలు విరిగిపడడంతో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ కుండపోత వర్షం కురిసింది. వందలాది ఎకరాల్లోని పసుపు, అరటి, కంద, కరివేపాకు పంటలు నీట మునిగాయి. కుంచనపల్లి, గుండిమెడ, మెల్లెంపూడి ప్రాంతాల్లో పొలాలకు రైతులు గండ్లు కొట్టారు. తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డ్ వద్ద గల పేదల ఇళ్లల్లోకి మోకాళ్లలోతు వర్షపు నీరు చేరింది. ఉమ్మడి పశ్చిమగోదావరిలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఏలూరు జిల్లాలో ఏలూరు నగరం, ముదినేపల్లి, కలిదిండి, ముసునూరు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. పశ్చిమగోదావరిలో ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షాలతో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండటంతో చేపలు, రొయ్యలు తేలిపోతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల రొయ్యలకు విబ్రియో వైట్‌స్పాట్ వంటి వైరస్‌లు సోకి మృత్యువాత పడుతున్నాయని ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలంలో విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పదిగ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. స్తంబాలను, విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ, జికె.వీధి తదితర ఏజెన్సీ మండలాల్లో భారీ వర్షం కురిసింది. గెడ్డల్లోకి ఉధృతంగా నీరు వచ్చి చేరింది. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. పర్యాటక కేంద్రాలను చూసేందుకు వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. వారపు సంతలు వెలవెలబోయాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా కొద్దిపాటి వర్షం పడింది.

### బండరాయిని ఢీకొట్టిన గూడ్స్‌బండి

కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని చిమిడిపల్లి - బర్రా 55 మైలురాయి వద్ద విరిగిపడిన పెద్ద బండరాయిని ఆదివారం తెల్లవారుజామున గూడ్స్ రైలు ఢకొట్టింది. ఈ ఘటనలో ఇంజిన్, భోగి పట్టాలు తప్పాయి. కిరండూల్ నుంచి విశాఖకు వస్తున్న గూడ్స్ రైలు ఆదివారం తెల్లవారు నాలుగు గంటల సమయంలో బండరాయిని ఢకొట్టి నిలిచిపోయింది. ఇంజిన్ ముందుభాగం దెబ్బతింది. పైలట్ ఈ విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేశారు. వెంటనే ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కిరండూల్ నుంచి విశాఖ వెళ్లే రైళ్లను రాయగఢ్ మీదుగా విశాఖకు మళ్లించారు. యుద్ధ ప్రతిపాదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి మధ్యాహ్నం నుంచి యధావిధిగా రైళ్ల రాకపోకలను కొనసాగించారు.

### వాయుగుండంగా బలపడే అవకాశం

22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. వాయుగుండం ప్రభావంతో సోమవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మంగళవారం పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, బుధవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణ, గుంటూరు, పల్నాడు, కడప, అన్నమయ్య, చిత్తూరు, గురువారం కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, గుంటూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

# చెడుపై ధర్మం సాధించిన విజయం

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు - గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** ఆనందకరమైన దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపాల పండుగ చెడుపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక కాలంలోని చెడులను జయించి, శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం నెలకొనే సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆత్మ నిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తితో దేశీయ తయారీదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు ఈ పండుగను జరుపుకోవడానికి స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీపావళి మన చుట్టూ ఉన్న ప్రజల జీవితాల్లో ప్రకాశం, ఆనందం, శ్రేయస్సును మరింతగా పెంచేందుకు కొత్త ఆలోచనలకు, కొత్త ఆదర్శాలకు నాంది పలికి రాష్ట్ర ప్రజలకు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

### రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెండేండ్ల ప్రజాపాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజల జీవితాల్లో ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చిందని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలనిలి సూచించారు. ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### చిరు దివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



రాష్ట్ర ప్రజలందరికీ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిరు దివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి అన్నారు. వెలుగులు పంచే దీపావళి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగును ఇవ్వాలని కోరారు. పేదలు, రైతుల జీవితాలలో వెలుగులు నింపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సుఖ సంతోషాలు, సిరి సంపదలు, సౌభాగ్యం, సమృద్ధి ఎల్లప్పుడూ మీ ఇంట వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరూ కలిసి దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

### చీకటిపై వెలుగుల విజయం : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



దీపావళి పండుగ చీకట్లపై వెలుగుల విజయమని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటిలో ఆనందం నింపుతూ కుటుంబాల్లో సౌభాగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ స్నేహం, సౌహార్దం, సోదరభావంతో కలిసి దీపావళిని జరుపుకోవాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మెన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, జాగృతి అధ్యక్షులు కవిత తదితరులు దీపావళిపండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అధిష్టానాన్ని లైట్ తీసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి పదేళ్ల తర్వాత వచ్చింది. అయితే అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన నేతలు వీధిన పడుతున్నారు. చిల్లర గొడవలకు దిగుతున్నారు. అయితే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను అధినాయకత్వం నియమించినప్పటికీ నేతల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని పిస్తుంది. గతంలో ఉన్న ఇన్ ఛార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీని తొలగించిన పార్టీ నాయకత్వం గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే మీనాక్షి నటరాజన్‌ను ఇన్‌ఛార్జిగా నియమించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన మంత్రులే గొడవ పడుతుండటం కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను అయోమయానికి గురి చేసింది .. దీంతో మీనాక్షి నటరాజన్‌కు కూడా నేతలు వెరవకుండా తమకు తోచినట్లే వ్యవహరిస్తున్నారంటున్నారు. నేతల్లో సఖ్యత కొర వడింది. ప్రభుత్వంలో మంత్రుల మధ్య కూడా సమన్వయం కనిపించడం లేదు. చిన్న చిన్న వాటికి వారు గొడవలకు దిగుతున్నారు. మీడియాకు ఎక్కుతున్నారు. మంత్రుల తీరుపై పార్టీ నాయకత్వం ఆగ్రహంగా ఉందని అంటున్నా మీనాక్షి నటరాజన్ మాత్రం ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఒకవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరిగే అవకాశముండటంతో వరసగా మంత్రులు గొడవలకు దిగడం పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు... మీనాక్షి నటరాజన్ రాహుల్ కోటరీలో కీలకమైన నేత కావడంతో ఆమె పార్టీని సెట్ చేశారని అనుకున్నారు. ఆమె సాదాసీదాగానే ఉంటున్నారు. జీవనశైలి ఇక్కడ ముఖ్యం కాదు. పార్టీని గాడిలో పెట్టడం ముఖ్యమన్నది మీనాక్షి నటరాజన్ మర్చిపోతున్నారన్నకామెంట్స్ వినపడుతున్నాయి. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ లో బయోకెమిస్ట్రీలో పీజీ చేశారు. ఇండోర్ లో చదువుకుంటూనే రాజకీయాలపట్ల ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ సింప్లిసిటీని చూసి ఆమె కూడా అదే పార్టీని ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ లో పనిచేశారు. తర్వాత 2008లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుల య్యారు. 2009 ఎన్నికల్లో మందసౌర్‌నుంచి పోటీచేసి మీనాక్షి నటరాజన్ విజయం సాధించారు. గతంలో 2024, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయి 2024లో విజయంసాధించి ఎంపీగాఎన్నికయ్యారు. రాహుల్ టీంలో ఒక సభ్యురాలిగా చేరారు. రాహుల్ గాంధీకి నమ్మకమైన నేతగా పేరుపొందారు. అయినాసరే నేతలు మాత్రం ఎటువంటి జంకులేకుండా పార్టీ పరువును వీధికెక్కిస్తు న్నారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు కూడా వివాదాస్పద వ్యాఖ్యలుచేసి పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నారు. మీనాక్షి నటరాజన్ నేరుగా ఇక్కడి విషయాలను రాహుల్ గాంధీకి చేరవేసే చొరవ ఉన్నప్పటికీ ఆమె ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజుకో రగడ పార్టీని ప్రజల్లో నవ్వుల పాలు చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు అధికారంలో కాంగ్రెస్ ఉంటుందని చెబుతున్నప్ప టికీ పార్టీ నేతలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

### కోమటిరెడ్డి సైతం

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్సైజ్ పాలసీని సమీక్షించాలని కోమటిరెడ్డి కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకునేలా లిక్కర్ సిండికేట్లు వ్యవహరిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం వేళ మద్యం దుకాణాలు తెరిచి ఉండటంతో పగలు, రాత్రనక మద్యం తాగుతూ ఆర్థికంగా కుటుంబాలు నలిగిపోతున్నాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అందుకే సాయంత్రం వేళల్లో మాత్రమే మద్యం షాపులు తెరిచేలా ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని మార్చాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మాత్రం తాను ఊరిలో వైన్ షాపునకు అనుమతిచ్చే ప్రసక్తి లేదని తెలిపారు. ఊరి బయట వైన్ షాపులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై తాను ప్రభుత్వంతో మాట్లాడతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో తాను రాజీపడబోనని చెప్పారు.

# 23 కేసీఆర్ ఫోటో లేకుండా కవిత యాత్ర

**హైదరాబాద్, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** భారత రాష్ట్ర సమితి బహిష్కృత నేత కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. నేరుగా ప్రజల వద్దే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. త్వరలోనే ఆమె జాగృతి జనం బాట పేరుతో రాజకీయ యాత్ర మొదలు పెట్టబోతున్నారు. ఈ నేపథ్యంలోనే తన రాజకీయ ప్రయాణాన్ని.. తన లక్ష్యాలను కవిత మరోసారి వివరించారు. ఈసారి కూడా తనదైన శైలిలో ఆరోపణలు, విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అగ్ర నాయకులు కేటీఆర్, హరీష్ రావు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం చేస్తున్నారు. మాగంటి సునీత గోపీనాథ్ ను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. గులాబీ పార్టీ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తుండగా.. కవిత కూడా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రజల వద్దే తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు.జాగృతి జనం బాటకు సంబంధించి కవిత సంచలన విషయాలను వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకోవడానికి తాను ఈ యాత్ర చేపడుతున్నట్టు కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది కుంటుపడిపోయిందని.. ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నారని.. ప్రభుత్వ పెద్దలు మాత్రం రైజింగ్ తెలంగాణ అంటూ నినాదాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పరిపాలనలో తెలంగాణ ఏ విధంగా నష్టపోతుందో చెప్పడానికి తాను ఈ యాత్ర చేస్తున్నట్టు కవిత పేర్కొన్నారు. రాజకీయంగా కూడా తన స్థానాన్ని తెలంగాణ ప్రజల గుండెల్లో సుస్థిరం చేసుకోవడానికి అడుగులు వేస్తున్నట్టు కవిత వెల్లడించారు. యాత్రకు సంబంధించి విధివిధానాలు మరికొద్ది రోజుల్లో వెల్లడిస్తానని కవిత పేర్కొన్నారు.యాత్ర చేస్తున్న నేపథ్యంలో కవిత కెసిఆర్ ఫోటోలు లేకుండానే ప్రజల ముందుకు వెళుతున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని కొంతమంది విలేకరులు కవిత ఎదుట ప్రస్తావించారు. దానికి ఆమె తనదైన శైలిలో సమాధానం చెప్పింది." కెసిఆర్ లాంటి వ్యక్తి కడుపున పుట్టడం జన్మజన్మల అదృష్టం. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప అటువంటి భాగ్యం కలగదు. నాకు అది దక్కింది. కాకపోతే ఇప్పుడు రాజకీయంగా దారులు వేరయ్యాయి. అలాంటప్పుడు కేసీఆర్ పేరు చెప్పడం అనేది నైతికంగా సరైనది కాదు. చెట్టు పేరు చెప్పుకొని పండ్లు అమ్ముకునే దుస్థితి నాకు లేదు. నేను వేరే దారి చూసుకుంటున్న. గతంలో జాగృతి సంస్థను ఏర్పాటు చేసినప్పుడు నేను కేసీఆర్ ఫోటో పెట్టలేదు. జయశంకర్ సార్ ఫోటో మాత్రమే వాడుకున్నాం. రాజకీయంగా ఆలోచనలు వేరే విధంగా ఉన్నప్పుడు కెసిఆర్ ను స్మరించడం సరైన విధానం కాదని" కవిత క్లారిటీ ఇచ్చారు.ఇటీవల కవిత జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత జాగృతి సంస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారు. జిల్లాలలో పలు కమిటీలను ఏర్పాటు చేశారు. వారి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పుడిక జిల్లాల బాటను మొదలుపెట్టారు కవిత. ఈ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో తనకంటూ బలమైన రాజకీయ పునాదులు వేసుకునేందుకు ఆమె అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే తన యాత్రకు సంబంధించి శ్రేణులకు కవిత దిశా నిర్దేశం చేశారు. అడుగులుగా ఆరోపణలు చేయకుండా సెటిల్డ్ గా మాట్లాడుతున్నారు కవిత. అందువల్లే మీడియా కూడా ఆమె వార్తలకు విపరీతమైన ప్రయారిటీ ఇస్తోంది.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉండదు

- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి
- జిల్లా కలెక్టర్ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 19 :** ఈనెల 20వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ ఉండదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.అయితే మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.


## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి



**రాయదుర్గం, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. దీపావళి అంటే చెడుపై మంచి విజయం సాధిస్తుంది అనే సంకేతం,అలాగే చీకటిపై వెలుగు విజయం సాధిస్తుంది అనే నమ్మకం, రాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సుదినం.ఇది ఆధ్యాత్మిక పునరుద్ధరణ, కుటుంబం మరియు సమాజ బంధాలు బలపడే సుసందర్భం. శ్రేయస్సు మరియు సంపదను స్వాగతించే సమయం, లక్ష్మీ దేవిని పూజించడం ద్వారా అష్టైశ్వర్యాలు కలుగుతాయన్న విశ్వాసం, చీకటి నుండి బయటపడి వెలుగు వైపు సరికొత్త జీవితాన్ని ప్రారంభించే సమయం. మీ జీవితం కొత్త రంగులతో, కొత్త కాంతులతో వెలుగాలని. లక్ష్మీ కటాక్షం తో, ముక్కోటి దేవతల ఆశీస్సులతో మీరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుని ప్రార్థిస్తున్నానని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలిపారు.

## వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** గోరంట్ల మండలంలోని బూదిలి పంచాయతీ సర్పంచ్ రామాంజనేయులు ఆహ్వానం మేరకు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వాల్మీకి రిజర్వేషన్ సమితి నాయకులు, కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ పాలసముద్రం సింగల్ అధ్యక్షులు బెల్లాల చెరువు చంద్ర, వాల్మీకి సంఘం మండల అధ్యక్షులు వెంకటనారాయణ, పాలసముద్రం నరసింహులు, టీడీపీ లక్ష్మీనరసు, ఈశ్వర్,వాల్మీకి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నారాయణ స్వామి, ఆదినారాయణ, తలారి శంకర, రాజు, నరసింహులు, గోపి, రాజు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎద్దు పొడిచి వ్యక్తికి తీవ్రగాయాలు



**కనేకల్, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** కనేకల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కురుబ యువరాజ్ (25) అనే యువ రైతు ఆదివారం సాయంత్రం ఎద్దుల బండి కడుతుండగా ఎద్దు బెదిరి రైతు తొడపై బాగాన ఎద్దు పొడవడంతో తీవ్ర గాయాల పాలైనాడు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు గమనించి వెంటనే కనేకల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 108 అంబులెన్స్ లో అత్యవసర చికిత్స కోసం తరలించారు.

# ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

## 110 మంది రక్తదానం - స్వచ్ఛందంగా ముందుకొచ్చిన పోలీస్, మీడియా మిత్రులు

**రాయదుర్గం, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** పట్టణంలోని పోలీస్ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పట్టణంలోని అమరవీరుల దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని, పోలీసులు, పాత్రికేయ మిత్రులు, రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి రవిబాబు, రాయదుర్గం సీఐలు, జయనాయక్, వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అంకిత భావంతో, పోలీస్ వృత్తిని దైవంగా భావించి ప్రాణ త్యాగాలు చేసిన ఎంతోమంది అమరులైన,, పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని డీఎస్పీ రవిబాబు అన్నారు. రక్తదానం చేయడం, మానవత సేవలో వ్యక్తి ప్రాణాపాయ సమయంలో ఉన్న ప్రతి మనిషిని కాపాడుకోవడానికి కోసం యువత పెద్దసంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయడం గర్వకారణమన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పోలీసులు పాత్రికేయులు రక్తదానం చేయడం , యువతకు ఆదర్శం పాత్రికేయులు పోలీసులు నిలిచారన్నారు. దాదాపుగా 110 మంది రక్తదానం ఇవ్వడం ఎంతగానో ఉపయోగమని ఆయన యువతను కొనియాడారు. అనంతరం ఇటీవల పాక్ యుద్ధంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరుడై మరణించిన మురళి నాయక్ చిత్రపటానికి పోలీస్ సిబ్బంది,పాత్రికేయులు, పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద సంస్థ నాయకులు యువకులు జోహార్ మురళి నాయక్, అమరవీరులకు జై అంటూ నినాదాలు చేసి, ఘనంగా అమరవీరుల దినోత్సవ వేడుకాలను జరుపుకున్నారు. రక్తదానం చేసిన సీఐ జయ నాయక్, ఏ ఎస్ ఐ, నూర్, హెడ్ కానిస్టేబుల్ బాలు, పోలీసులు సూరి,నరేష్, మంజు,పరమేష్,బాబు, వీరితో పాటు పాత్రికేయులు ఈరన్న, ఏబీఎన్ రాము, టెన్ టీవీ పాత్రికేయుడు, కే టి ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు యువకులు పోలీసులు పాత్రికేయులు స్వచ్ఛంద సంస్థ దాతలు తదితరులు పాల్గొన్నారు.









### డీఆర్‌సీ సమావేశాలకు గుర్తింపు పొందిన

# రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించాలి

## పీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా



**పొదిలి, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** డీఆర్‌సీ సమావేశాలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా అన్నారు.ప్రతి 3 నెలలకు ఒకసారి జరిగే!ఈసమావేశాలు అత్యంత ముఖ్యమైనవి అని చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్ సారధ్యంలో జరిగే డి.ఆర్.సి సమావేశాల్లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరుగుతుంది కాబట్టి ఎన్నికైన శాసనసభ్యులు,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు జిల్లా పరిషత్ చైర్మన్, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొనడం మొట్ట మొదటించి వస్తున్న టువంటి సాంప్రదాయమని ఆయన తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఈ సాంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చిందని,అధికా ర పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన శాసనసభ అభ్య ర్థుల్ని డి.ఆర్.సి సమావేశంలో కూర్చోబెట్టి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం. వారికి సమావేశాల్లోప్రాధాన్యత కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా సైదా గుర్తు చేశారు.గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని ఇప్పుడు రాష్ట్రంలో,అధికారం లోఉన్న.ఎన్డీఏ కూటమి అను సరించడంసమంజసం కాద న్నారు.మీరు అదే విధానాన్ని కొనసాగించదల్చుకుంటే! ఎలా.. ఇంక చెప్పేదేముందన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులతోపాటు ఓడిపోయిన శాసన సభఅభ్యర్థులతోకలిపిగుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధులను డి.ఆర్.సి సమావేశాలకు ఆహ్వానించాలని ఈ సందర్భంగా షేక్ సైదా కూటమి ప్రభుత్వానికి కోరారు. దీని ద్వారా జిల్లాలో నెల కొని యున్న వివిధ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు సూచించే అవకాశం ఉంటుం దన్న ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్ లు బాధ్య త తీసుకొని,తగు శ్రద్ధ వహించి వివిధ రాజకీయ పక్షాల నేతలను డి.ఆర్.సి సమావేశాలకు ఆహ్వానించాలని కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేసారు..

# గోరంట్లలో వేమన విగ్రహం ఏర్పాటు చేయాలి


## మంత్రి సవితమ్మకు రెడ్డి సంఘం నాయకుల వినతి

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** గోరంట్ల మండల కేంద్రంలో వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని మండల రెడ్డి సంఘం నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ ని పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో కలిశారు, ఈ సందర్భంగా గోరంట్ల మండల కేంద్రంలో వేమన విగ్రహ ఏర్పాటుకు స్థలం కోసం మంత్రి సవితమ్మని కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కారం చూపుతామని మంత్రి సవితమ్మ హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, మల సముద్రం సర్పంచ్ సువర్ణ అశ్వర్థ రెడ్డి,ఉత్తమ రెడ్డి, కసిరెడ్డి పల్లి రాజారెడ్డి, ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి,గంగాధర్ రెడ్డి,చెన్నారెడ్డి,గట్టు చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ శంకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వేమా రెడ్డి, రాజారెడ్డి, మిక్సర్ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాత్రివేళ జిల్లా ఎస్పీ తనిఖీలు

**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ శనివారం రాత్రి పుట్టపర్తి అర్బన్, బుక్కపట్నం కొత్తచెరువు ఆఫ్ గ్రేడ్ పోలీస్ స్టేషన్లతో పాటు ,జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాల నియంత్రణ, అక్రమ రవాణా, ప్రజల భద్రత, అసాంఘిక కార్య కలాపాలు పూర్తిగా అరికట్టేదిశగా జిల్లాఎస్పీ దృష్టి సారించారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రిపూట పోలీసులు గస్తీలు పెట్రో లింగ్, తనిఖీలు చేస్తున్నారా లేదా అని స్వయంగా పరిశీలిం చారు. అదేవిధంగా రాత్రిపూట సిబ్బంది ఆయా స్టేషన్లో ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు.ఎవరెవరు ఎలాంటి విధులు నిర్వహిస్తున్న అనేవిషయాలను ఆరాతీశారు. రాత్రిపూట గస్తీలు, పెట్రోలింగ్ చేపడుతున్నారా లేదా, స్టేషన్లో ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. అనే విషయాలపై ఆకస్మికంగా జిల్లా ఎస్పీస్వయంగా స్టేషన్లను తనిఖీ చేసి పరిశీలించారు,రాత్రిపూట గస్తీలు చేపట్టి ఎక్కడ ఎలాంటి సంఘటనలు, చోరీలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాలు కాలనీలలో ముమ్మరంగా పోలీసులు గస్తీలు బస్తీలో నిర్వహించాలని ఎవరైనా అర్ధరాత్రి వేల రోడ్లపై సంచరిస్తే వారి యొక్క పూర్తి ఆధారాలు తెలుసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి సిబ్బందికి సూచనలు చేశారు.



# రైతు పక్షపాతి... కూటమి ప్రభుత్వం

## అన్నదాతలకు కరెంటు కష్టాలు రానివ్వం
## త్వరలో మరో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ : మంత్రి సవితమ్మ




**పెనుకొండ, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** రైతు పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి సవితమ్మ తెలిపారు. రైతులకు కరెంటు కష్టాలు రానివ్వమని అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు ట్రాన్స్ఫార్మర్లు వచ్చేలా చూస్తామని తెలిపారు, పెనుకొండ పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం నందు నియోజకవర్గవ్యాప్తంగా మంజూరైన 75 మంది రైతులకు ట్రాన్స్ఫార్మర్లు జిల్లా ఎస్ఈ సంపత్ కుమార్ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి రైతులకు మంత్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వం అన్నారు, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గ వ్యాప్తంగా 475 ట్రాన్స్ఫార్మర్లు రైతుకు అందజేశామని తెలిపారు. త్వరలో మరిన్ని ట్రాన్స్ఫార్మర్లు అందజేస్తామన్నారు. వ్యవసాయంలో రైతులకు కరెంటు కష్టాలు లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందన్నారు. గత కొన్ని రోజులుగా ట్రాన్స్ ఫార్మర్ల కోసం నిరీక్షిస్తున్న రైతులకు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మంజూరు చేశామన్నారు. గతంలో ట్రాన్స్ ఫార్మర్ల కోసం రైతులు సంవత్సరాల తరబడి విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి చూశారన్నారు. కేవలం వైసీపీ సానుభూతి పరులకు మాత్రమే ట్రాన్స్ ఫార్మర్లు వచ్చేలా అప్పుడున్న నాయకులు ఒత్తిడి తెచ్చారన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు చూడకుండా ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి ట్రాన్స్ఫార్మర్లు ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాకనే పెండింగ్ లో ఉన్న వారికి ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు గారన్నారు. ఇంకా విద్యుత్ పరికరాలు అవసరమైన వాటిని సకాలంలో అందించాలన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు కూడా క్రమ సంఖ్య ఆధారంగా ఇవ్వాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు పరుస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు రైతులు చాలా ఇబ్బంది పడ్డారని డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో ఇప్పటికే రెండు సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలో మరో మూడు సబ్‌స్టేషన్ నిర్మాణంకు భూమి పూజ కూడా చేస్తామన్నారు. నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమ రాకతో వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తోందని తెలిపారు అదేవిధంగా వైజాగ్ లో గూగుల్ హబ్ రావడంతో ప్రపంచ దేశాలన్నీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని గూగుల్ హబ్ 1,33,000 కోట్ల రూపాయలతో ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడి పెడుతుందన్నారు దీనివల్ల లక్షలాది మందికి ఉపాది లభిస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో 9సార్లు కరెంటు చార్జీలు పెంచారని కూటమి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ సబ్సిడీ సోలార్ రూఫ్ టాప్ ను ఉపయోగించుకుని పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ లు కూటమి నాయకులు కార్పొరేషన్ డైరెక్టర్లు అధికారులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మందుల దుకాణాలపై కొరవడిన నిఘా

## డ్రగ్ ఇన్స్‌పెక్టర్ల జాడ కనిపించడం లేదు
## రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల మందుల దుకాణాలు వెలుస్తున్నాయని వాటినిపై ఔషధ నియంత్రణ అధికారుల నిఘా కొరవడిందని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ల జాడ కనపడటం లేదని అందువల్ల వినియోగదారులు నష్టపోతున్నారని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తెలియజేశారు, ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మందుల దుకాణాలలో చాలావరకు ఫార్మసిస్టులు లేరని కేవలం సర్టిఫికెట్ కొనుక్కొని మందుల దుకాణాలను నడుపుతున్నారు తప్ప పూర్తి అవగాహన ఉన్నవారు లేరని అందువల్ల గ్రామీణ ప్రాంతాలలో వినియోగ దారులు చాలా ఇబ్బందులు గురవు తున్నారని తెలియజేశారు, ప్రతినిత్యం వేల సంఖ్యలో రోగులు మందులు దుకాణాల ముందు నిలబడి వారి యొక్క మందులను ఖరీదు చేస్తున్నారన్నారు, వినియోగదారులకు కనీసం మందులు ఏం తీసుకున్నారు, అన్నదానికి రసీదులు కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు, డాక్టర్ రాసి ఇచ్చినటువంటి చీటీలు లేకుండా మందులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ మందుల షాపులు యజమానులు నిబంధనలు పాటించకుండా రోగులకు మందులు ఇస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తనిఖీలు చేయవలసిన ఔషధ నియంత్రణ అధికారులు ( డ్రగ్ ఇన్స్పెక్టర్స్) అసలు ఎక్కడున్నారో తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అపోలో , మెడ్ ప్లస్ లాంటి కార్పొరేట్ ఫార్మసీస్ సైతం కేవలం ఇంటర్ డిగ్రీ స్టూడెంట్ లలో వికరించడం అనేది చాలా దారుణమని తెలియజేశారు.ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పూర్తిగా తొలగించినప్పటికీ మందుల దుకాణాలలో ఎటువంటి బిల్లును ఇవ్వకపోవడం వల్ల వినియోగదారులకు జీఎస్టీ వల్ల ఊరట లభించడం లేదని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా డ్రగ్ ఇన్స్పెక్టర్లు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసి పత్రికల ద్వారా అవగాహన కల్పించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఔషధ నియంత్రణ అధికారులు సరైన రీతిలో స్పందించకపోతే వినియోగదారులు నష్టపోతారని ఇప్పటికైనా మందుల దుకాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తెలియజేశారు.

# జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

◆ ఎస్పీ సతీష్ కుమార్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** శ్రీ సత్య సాయి జిల్లా ప్రజలకు మరియు జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు,పాత్రికేయులకు జిల్లా ఎస్పీఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ దీపావళి వేడుకలతో అందరి జీవితాల్లో వెలుగులు రావాలని, చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులతో వీర జిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది జరుపుకునే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణ సంచాను సరైన జాగ్రత్తలతో కాల్చాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండి ఈ దీపావళి వేడుకలు జరుపుకోవాలన్నారు.

# రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** గోరంట్ల మండలంలోని ఎగువ గంగంపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఓబులేసు కుమారుడు ఎల్లార్తి కిష్టప్ప (66) కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లి సమీపంలోని టీబీ క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. వారి వివరాల మేరకు మండలంలోని ఈ.గంగంపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప సొంత అవసరం నిమిత్తం గ్రానైట్ కొనుగోలు చేయడానికి బాగేపల్లి కి వెళ్లిన నేపథ్యంలో ఆదివారం టీవీ క్రాస్ వద్ద హైవే దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి చాంద్ భాషా అనే వ్యక్తి గోరంట్లకు ద్విచక్ర వాహనంలో వస్తున్న సందర్భంలో మృతుని ద్విచక్ర వాహనానికి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమీప బంధువులు తెలిపారు. కిష్టప్ప మృతదేహాన్ని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**నివాళులు అర్పించిన టిడిపి నాయకులు**

గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో టిడిపి నేత కిష్టప్ప మృతదేహాన్ని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచ్ నరేష్, ఉత్తమ రెడ్డి తదితరులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




# వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని సీఎంకు వినతి



**అమరావతి, సూర్యవాస్తవం, అక్టోబర్ 19:** ఆంధ్రప్రదేశ్ వెటరన్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు కాకర్ల వెంకటరత్నం, యం.వీ.రామారావు, శిరందాసు నాగార్జున, జీ.చంద్రశేఖర్, జీ.రామారావు శనివారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి, రిటైర్ అయిన జర్నలిస్టులకు పెన్షన్ పథకం ప్రవేశపెట్టలని కోరారు. ఆమేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. జర్నలిస్టుగా 20 ఏళ్ల అనుభవం ఉండి, 58 సంవత్సరాలు పూర్తి చేసినవారు రాష్ట్రంలో 500 మందికి మించి ఉండరని తెలిపారు. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక భారం ఉండదని చెప్పారు. దేశంలో 19 రాష్ట్రాలలో ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిటైర్ అయిన జర్నలిస్టుల పరిస్థితిని, ఇతర రాష్ట్రాలలో ఇస్తున్న పెన్షన్ వివరాలు, వాటికి సంబంధించిన జీవోలతో కూడిన ఒక వినతి పత్రాన్ని సీఎంకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారు.

# ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెలగాలి

● దీపావళి శుభాకాంక్షలు తెలిపిన అనంత



**అనంతపురం, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** దీపావళి పండుగతో ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెలగాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. 'సర్వేజన సుఖినో భవంతు' అంటూ జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిని వెలుగు తరిమికొట్టడాన్ని.. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా మనమంతా దీపావళి పండుగ జరుపుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు గ్రీన్ టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆరోగ్య రీత్యా అందరూ జాగ్రత్తలు పాటించాలని.. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు బాణాసంచకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గరే ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ దీపావళి పండుగకు ప్రజలందరి ఇళ్లలో అష్టలక్ష్ములు కొలువై సకల శుభాలు కలగాలని తెలిపారు.

# జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

● ఎస్పీ పి జగదీష్



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** జిల్లా ప్రజలకు మరియు జిల్లా పోలీసు సిబ్బందికి ఎస్పీ పి. జగదీష్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి.. చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణ సంచాను సరైన జాగ్రత్తలతో కాల్చాలని.. పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# కౌన్సిలర్ షబ్బీర్‌ను పరామర్శించిన కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయుంచుకొని నాయుడుపేట పట్టణం లోని తన నివాసములో విశ్రాంతి తీసుకుంటున్న నాయుడుపేట మునిసిపల్ కౌన్సిలర్ షబ్బీర్‌ను ఆదివారం సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. అలాగే నాయుడుపేట పట్టణ వైసిపి అధ్యక్షులు కలికి మాధవ్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణ రెడ్డి,లీగల్ అడ్వైసర్ లాయర్ చదలవాడ కుమార్,దొరవారిసాత్రం మండల కన్వీనర్ రాహుల్ రెడ్డి కౌన్సిలర్ దారా రవి,వైసిపి నాయకులు పెర్నాటి రాహుల్, నిడిగంటి చిట్టీ బాబు, రెహమాతుల్లా పలువురు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షబ్బీర్ పూర్తి ఆరోగ్యంగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టులకు దీపావళి కానుకలు పంపిణీ



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆనందంగా దీపావళి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ముస్లిం మైనార్టీ యువ నాయకుడు ఉమర్ ఖాన్ గోరంట్ల మండలంలోని జర్నలిస్టులకు దీపావళి పండుగ సందర్భంగా ఫ్యామిలీ ప్యాక్‌తోపాటు మిఠాయిలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఖాన్‌తోపాటు కూటమి నాయకులు మండల ప్రధాన కార్యదర్శి, మల సముద్రం సర్పంచ్ సువర్ణ,అశ్వర్థ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేష్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, బొట్టు శ్రీనివాసులు,మండల టీడీపీ నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ నిమ్మల శ్రీధర్, మాజీ ఉప సర్పంచ్ సుబ్బరాయుడు, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్,శ్రీనివాసులు, శంకర్, బాలకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా మీడియాజర్నలిస్టులు ఉమర్‌ఖాన్‌కు అభినందనలు తెలియజేశారు.



## దీపావళి ప్రతి ఇంట్లో వెలుగు, ఆనందం నింపాలి

- టీటీడీ ఛైర్మన్, ఈవో దీపావళి శుభాకాంక్షలు





**తిరుమల, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల జీవితాలలో దీపావళి వెలుగు, సంతోషం నింపాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆకాంక్షించారు. శ్రీవారి భక్తులకు, ఉద్యోగులకు, శ్రీవారి సేవకులకు ఆదివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండి, అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం, అభివృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని టిటిడి ఛైర్మన్ కోరారు.

## సురక్షిత దీపావళి ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు
- జిల్లా ఎస్పీ యల్.సుబ్బరాయుడు



**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ యల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ గారు పేర్కొంటూ, "అనుమతులు పొందిన బాణాసంచా షాపుల నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి. ప్రతి షాపు వద్ద నీటి బిందెలు, మట్టి, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వంటి అవసరమైన భద్రతా పరికరాలు సిద్ధంగా ఉంచాలి. అదేవిధంగా ఫైర్ ఇంజన్ సిద్ధంగా ఉంచడం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టామని" తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో రద్దీ నియంత్రణకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయబడిందని, ప్రజలు శాంతియుతంగా మరియు భద్రతగా దీపావళి జరుపుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ గారు పేర్కొన్నారు. అదేవిధంగా హెచ్చరిస్తూ, "అనధికారిక బాణాసంచా విక్రయాలు లేదా నిల్వలు ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయి. అటువంటి కార్యకలాపాలు గమనించిన వారు వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలి. అనుమతి లేని విక్రయాలు చేసిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు" అని స్పష్టం చేశారు. ప్రజలందరూ దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లలను పెద్దల పర్యవేక్షణలో ఉంచాలి, రోడ్లపై లేదా గ్యాస్ సిలిండర్ వంటి ప్రమాదకర ప్రదేశాల్లో బాణాసంచా కాల్చరాదని సూచించారు. "ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. ఈ దీపావళి ప్రతి ఇంటా సురక్షితంగా, ఆనందంగా వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాను," అని జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారు అన్నారు. తిరుపతి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 112అత్యవసర సమయంలో ఉపయోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### పూర్ణాహుతితో ముగిసిన జూబ్లీహిల్స్

# శ్రీ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు





**హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సలహా మండలి అధ్యక్షులు వేంకటేశ్వర రెడ్డి, ఏఈవో రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ కుమార్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# బీహార్ పాలిటిక్స్‌లో వారసులు

- అన్ని పార్టీలది అదే పంథా

**పాట్నా, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** ఏ రాష్ట్రం చూసినా ఏమున్నది గర్వ కారణమన్నట్టుగా ఎన్నికలు మారాయి. ఏ ఎన్నిక వచ్చినా చాలు రాజకీయ నాయకులు వారసత్వ రాజకీయాలకు తెరలేపుతూ తమ వారసులు లేదా కుటుంబ సభ్యులను పోటీలో నిలుపుతున్నారు. త్వరలో అసెంబ్లీ పోల్స్ జరగనున్న బీహార్‌లో ఈ ప్రభావం కాస్త ఎక్కువే. అందుకు ఏ రాజకీయ పార్టీ అతీతం కాదనే చెప్పాలి. కండబలం, ధనబలం కలిగిన నేతల వారసులకు అసెంబ్లీ టికెట్లను అన్నీ పార్టీలు ఇచ్చాయి. బీహార్‌లోని ప్రధాన పార్టీలకు కుటుంబ రాజకీయాలే ముఖ్య ఆధారంగా నిలుస్తున్నాయి. ప్రముఖ రాజకీయ కుటుంబాల వారసులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ క్రమంలో బీహార్ ఎన్నికల బరిలోకి దిగుతున్న రాజకీయ వారసులు ఎవరు? ఈ విషయం గురించి ప్రధాన రాజకీయ పార్టీలు ఏం అంటున్నాయి? తదితర విషయాలు తెలుసుకుందాం.

**రాఘోపూర్ నుంచి తేజస్వీ, తారాపూర్ నుంచి సామ్రాట్ చౌదరి**

రాఘోపూర్ నుంచి ఆర్జేడీ తరపున తేజస్వి యాదవ్ (రాష్ట్రీయ జనతాదళ్ చీఫ్ లాలూ ప్రసాద్ చిన్న కుమారుడు, రాజకీయ వారసుడు), తారాపూర్ నుంచి బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి (మాజీ మంత్రి శకుని చౌదరి కుమారుడు), రఘునాథ్ పుర్ నుంచి ఆర్‌జేడీకి చెందిన ఒసామా షాహేబ్ (గ్యాంగ్‌స్టర్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన మహ్మద్ షాబుద్దీన్ కుమారుడు) బరిలోకి దిగారు. ససారం నుంచి రాష్ట్రీయ లోక్ మోర్చాకు చెందిన స్నేహలత(ఆర్‌ఎల్‌ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహా భార్య), ఝంఝార్ పుర్ నుంచి బీజేపీ తరపున నీతీశ్ మిశ్రా (మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కుమారుడు), ఇమామ్ గంజ్‌నుంచి హెచ్‌ఏఎం తరపున దీపా మాంఝీ (కేంద్ర మంత్రి జితన్ రామ మాంఝీ కోడలు) పోటీలో ఉన్నారు. జన్ సురాజ్ పార్టీ తరపున మోర్వా నుంచి జాగృతి ఠాకూర్ (లెజెండరీ సోషలిస్ట్ నాయకుడు కర్పూరి ఠాకూర్ మనవరాలు) పోటీలో ఉన్నారు. జేడీయూ తరపున గైఘాట్ నుంచి కోమల్ సింగ్ (ఎల్‌జేపీ ఎంపీ వీణాదేవి కుమార్తె) ఎన్నికల బరిలోకి దిగారు. నబీనగర్ నుంచి చేతన్ ఆనంద్ (ఎంపీ లవ్లీ ఆనంద్ కుమారుడు) తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేపీ తరపున బంకిపుర్ నుంచి నితిన్ నబిన్ (దివంగత నేత నబిన్ కిషోర్ సిన్హా కుమారుడు) బరిలో దిగారు. దిఘా నుంచి సంజీవ్ చౌరాసియా (బీజేపీ సీనియర్ నేత గంగా ప్రసాద్ చౌరాసియా కుమారుడు) పోటీలో ఉన్నారు. ఆర్‌జేడీ తరపున షాపుర్ నుంచి రాహుల్ తివారీ (సీనియర్ నాయకుడు శివానంద్ తివారీ కుమారుడు) తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ స్థానం నుంచి బీజేపీ తరపున రాకేశ్ ఓజా (సీనియర్ నేత విశేశ్వర్ ఓజా కుమారుడు), మొకామా నుంచి వీణా దేవి (ఆర్‌జేడీ నేత సూరజ్ భాన్ సింగ్ భార్య), లాల్ గంజ్ నుంచి శివాని శుక్లా (ఆర్‌జేడీ నేత మున్నా శుక్లా కుమార్తె) పోటీ చేస్తున్నారు.

**సైద్ధాంతిక, రాజ్యాంగ విలువలను పట్టించుకోని పార్టీలు**

రాజకీయ నేతల వారసులు, కుటుంబ సభ్యులు పాలిటిక్స్‌లోని ప్రవేశించే విధానాన్ని చూస్తే, ఇప్పుడు అన్ని పార్టీలు సైద్ధాంతిక నిబద్ధతలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాల గురించి పెద్దగా పట్టించుకోవడంలేదని తెలుస్తోందని పాట్నాలోని ఏఎన్ సిన్హా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వికాశ్ అభిప్రాయపడ్డారు. 'తమవారు రాజకీయాల్లో స్థిరపడి ఉంటారు కాబట్టి వారసులు ఈజీగా పాలిటిక్స్‌లోకి వచ్చేస్తున్నారు. వారసత్వ రాజకీయాలకు




వ్యతిరేకంగా ప్రజలు తమ గొంతుకను వినిపించాలి. 77 ఏండ్లుగా బీహార్‌లో విద్యకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల కూడా ఇది జరుగుతోంది' అని ఆయన పేర్కొన్నారు. 'రాజకీయ నేతల వారసులు రాజకీయాల్లోకి ప్రవేశించే విషయంలో బీహార్‌లోని ఏ పార్టీ కూడా నైతిక ఆధిపత్యాన్ని ప్రకటించలేదు. బీహార్‌లో గ్రామీణ జనాభా విద్యాస్థాయి చాలా తక్కువగా ఉంది. తాజా కుల సర్వే ప్రకారం, బీహార్ జనాభాలో 14.71 శాతం మంది మాత్రమే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వారికి రాజకీయంగా అవగాహన లేదు. అందుకే రాజకీయ పార్టీలు తక్కువ విద్యావంతులైన ఓటర్లను సద్వినియోగం చేసుకుని వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయి' అని వికాస్ అభిప్రాయపడ్డారు.

**ఆర్‌జేడీ ఏమందంటే?**

ప్రస్తుత కాలంలో ఏదైనా రాజకీయ పార్టీకి చెందిన సాధారణ కార్యకర్త ఎన్నికల్లో పోటీ చేయడం గురించి ఆలోచించలేడనేది వాస్తవమని ఆర్‌జేడీ అధికార ప్రతినిధి మత్యుంజరు తివారీ తెలిపారు. అదే సమయంలో, ఎన్నికల్లో గ్లామర్ అంతర్భాగంగా మారడంతో సాధారణ కార్యకర్తలకు పార్టీలు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ఖర్చు పెరిగిపోవడంతో సాధారణ కార్యకర్తకు పోటీ అనేది అసమానంగా మారిపోయిందన్నారు.

## ఢిల్లీలో క్షీణిస్తున్న వాయునాణ్యత

**ఢిల్లీ, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** దీపావళికి ముందు దేశ రాజధాని ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ పడిపోతుంది. ఐదు రోజలుగా గాలి నాణ్యత క్షీణిస్తోంది. వికాస్‌పురి ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ 238గా నమోదైంది. దీంతో వికాస్‌పురి ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. అక్షరధామ్ ప్రాంతంలో వాయు నాణ్యత 426గా నమోదైంది. ఈ సీజన్‌లో నగరంలో ఇదే అత్యధిక కాలుష్య స్థాయి అని సిపిసిబి వెల్లడించింది. ఆనంద్ విహార్ ప్రాంతం 418 ఎక్యూఐతో తర్వాతి స్థానంలో ఉంది. పెరుగుతున్న కాలుష్య స్థాయులను అరికట్టడానికి ఇండియా గేట్ వద్ద వాటర్ స్ప్రింక్లర్లను మోహరించినట్లు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఈ ప్రాంతంలో వాయు నాణ్యత 269గా నమోదైనట్లు తెలిపారు. రాజధానిలోని 38 వాయు పర్యవేక్షణ కేంద్రాలలో తొమ్మిది ఇప్పటికే అత్యంత పేలవమైన కేటగిరిలోకి వచ్చినట్లు తెలిపారు. ఆనంద్ విహార్‌లో (389), వజీర్‌పూర్ (351), జహంగీర్‌పురి (310), ద్వారక (310) ఎక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. చలిమంటలు, బాణసంచా పేలుళ్లతో రానున్న రోజుల్లో వాయు కాలుష్యం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు.



# సూపర్ జీఎస్టీపై విస్తృతంగా ప్రచారం

## తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య

## ఆర్థిక ప్రగతిని సాధించడమే ఉద్దేశం: జీఎస్టీ అడిషనల్ కమిషనర్లు నాగేంద్ర, శర్మ





**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ భాగంగా తగ్గింపు రేట్లపై నెల రోజులు పాటు అనేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిం చడం జరిగిందనీ, ప్రతి ఒక్కరికి జీఎస్టీ తగ్గింపు ఫలాల గురించి ఇంకా విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం కచ్చపీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్టీ అడిషనల్ కమిషనర్లు నాగేంద్ర, శర్మ , పర్యాటకశాఖ ఆర్ డి రమణ ప్రసాద్ తో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ.. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ భాగంగా తగ్గింపు రేట్లపై నెల రోజులు పాటు అనేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18 నుంచి 5శాతం, 12 నుంచి 5 శాతం 28 నుంచి 18శాతం వరకు తగ్గింపు అనేది ఉందని తెలిపారు. ప్రతిరోజు నిత్యం వాడే టూత్ పేస్ట్ నుంచి మిల్క్, బిస్కెట్స్, చాక్లెట్స్, జిమ్ ఐటమ్స్, వాహనాలు కలంకారీ మీద తగ్గింపు అనేది ఉందని అన్నారు. ఇవన్నీ కూడా ప్రజలకు తెలియాలని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా సందర్భంగా వాడే టపాకాయలు సంబంధించి పొల్యూషన్ తగ్గించడంలో భాగంగా గ్రీన్ టపాకాయలు ప్రతి ఒక్కరు వాడాలి. వాటి ధరలు చాలా వరకు తగ్గింపు ఉండేలా చూడాలని తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై కూడా చాలా వరకు ధరలు తగ్గాయని దీనిపై కూడా అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జిఎస్టి అడిషనల్ కమీషనర్లు మాట్లాడుతూ.. అనేక రకాలైన వస్తువుల, సేవల మీద పన్ను రేట్లను తగ్గించి దాని ద్వారా పొదుపు ను సాధించి ఆ పొదుపు ద్వారా ఇంకొక రకంగా పెట్టుబడి పెట్టి సంతృప్తికరమైన ఆర్థిక ప్రగతిని సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఉన్నతమైన అంకితభావంతో లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో రకాల వస్తువులు సేవలపై పన్ను రేట్లను తగ్గించి దానికి సంబంధించినటువంటి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రయోజనాల నిమిత్తం జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో తిరుపతి జిల్లాలో అయిదు వేల జీఎస్టీ కార్యక్రమాలను జరుపుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ ప్రధాన భూమికా అన్ని శాఖల సమన్వయంతో గ్రామ మరియు సచివాలయ సిబ్బంది తో కలిసి ప్రతి ఇంటింటికి వెళ్లి జీఎస్టీ ఫలాలు ఏ విధంగా అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు.

## పూర్ణాహుతితో ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు





**చంద్రగిరి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బీహేవియర్‌లో కేరళ అగ్రస్థానం

## బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్,ఉత్తరప్రదేశ్ వెనుక : ఇండియా టుడే సర్వే

**తిరువనంతపురం, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** దేశవ్యాప్తంగా పౌరుల వైఖరులు, ప్రవర్తన (బిహేవియర్)ను అంచనా వేయడానికి ఇండియా టుడే నిర్వహించిన దేశంలోనే మొట్టమొదటి జాతీయ ప్రవర్తనా సూచికలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. ఈ సర్వేలో నాలుగు ఇతివృత్తాలపై రాష్ట్రాలను అంచనా వేసింది. పౌర ప్రవర్తన, ప్రజా భద్రత, లింగ వైఖరులు, వైవిధ్యం, వివక్షత వంటివి భారతదేశంలో అభివద్ధి చెందుతున్న సామాజిక నిర్మాణంపై వివరణాత్మక రూపాన్ని అందించేందుకు ఈ సర్వే నిర్వహించింది. ఈ అంశాల్లో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర నాల్గవ స్థానంలో ఉన్నాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్ అత్యల్ప ర్యాంక్ పొందిన రాష్ట్రాలుగా నిలిచాయి. పౌర అవగాహన, సామాజిక బాధ్యతకు శ్రద్ధ అవసరమయ్యే ప్రాంతాలను హైలైట్ చేశాయి. నియమాలకు కట్టుబడి ఉండటం, సమాజ భాగస్వామ్యం, సామాజిక బాధ్యతను కొలిచే పౌర ప్రవర్తన విభాగంలో, తమిళనాడు దేశానికి నాయకత్వం వహించింది. ప్రజా భద్రతలో కేరళ సూచికలో



అగ్రస్థానంలో ఉంది. చట్టం అమలు, వ్యక్తిగత భద్రతా భావంపై బలమైన ప్రజా విశ్వాసాన్ని ప్రదర్శిస్తోంది, ఆ తర్వాతి స్థానాల్లో హిమాచల్ ప్రదేశ్, ఒడిశా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్ అత్యల్ప స్థానాలను ఆక్రమించాయి. లింగ సమానత్వం, మహిళా సాధికారతపై ప్రగతిశీల అభిప్రాయాలను ప్రదర్శిస్తూ కేరళ కూడా లింగ వైఖరిలో ముందుంది. ఉత్తరాఖండ్, తమిళనాడు దగ్గరగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్ అట్టడుగు స్థానంలో ఉన్నాయి. వైవిధ్యం, వివక్ష నిర్మూలన విభాగంలో కేరళ మళ్ళీ మొదటి స్థానంలో నిలిచింది. సామాజిక సమ్మిళితత్వం, కుల, మత, సాంస్కృతిక వైవిధ్యాన్ని అంగీకరించడంలో ఉన్నత స్థాయిని ప్రదర్శించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉండగా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ అత్యల్ప స్థానంలో ఉన్నాయి.

**సర్వే వివరాలు**

స్థూల దేశీయ ప్రవర్తన సర్వే 22 రాష్ట్రాలను కవర్ చేసింది. ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా 9,188 మంది పాల్గొన్నారు. వారి నుంచి ప్రతిస్పందనలను సేకరించింది. నమూనాలో దాదాపు సమానమైన లింగ పంపిణీ ఉంది. 50.8 శాతం మంది పురుషులు , 49.2 శాతం మంది మహిళలు, సమతుల్య ప్రాతినిధ్యాన్ని నిర్ధారించారు. సర్వే గ్రామీణ-పట్టణ జనాభా నిష్పత్తిని కూడా ప్రతిబింబిస్తుంది, ప్రతివాదులు పట్టణ ప్రాంతాల నుంచి 54.4 శాతం, గ్రామీణ ప్రాంతాల నుంచి 45.6 శాతం మంది ఉన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


● జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** దీపావళి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలోని ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంధకారంపై వెలుగు విజయం సాధించిన దీపావళి పండుగ ప్రతి కుటుంబా నికి ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపా లని ఆయన ఆకాంక్షించారు. మనిషి తనలోని అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలుగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంటికి వెలుగు మాత్రమే కాదు, ఆశ, అభివృద్ధి, సంక్షేమం కూడా తీసుకురావాలని, రైతులు, యువత, మహిళలు, వృద్ధులు, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో దీపాలు వెలిగేలా ఆర్థికాభివృద్ధి, అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను, కొత్త కాంతులను తీసుకురావా లని, అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు. చిన్న పిల్లలతో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్త వహిస్తూ, తల్లిదండ్రులు లేదా పెద్ద వారి పర్యవేక్షణలో వారు ఉండేలా చూడాలని తెలిపారు. అధిక శబ్దం కలిగిన బాణసంచాను కాల్చే సమయంలో తోటి వారికి ఇబ్బంది కలగకుండా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాల న్నారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను, కొత్త కాంతులను తీసుకురావాలని, అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలకు సూచించారు.

## తిరుచానూరు పవిత్రతను కాపాడండి

●హిందూ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు మునిరామ్ రెడ్డి



**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** గత కొంతకాలంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలోని అధికారులు, విజిలెన్స్ సిబ్బంది, తిరుచానూరు పోలీసులు భక్తుల పట్ల మర్యాద లేకుండా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడడం చాలా దారుణమని సీనియర్ జర్నలిస్ట్, హిందూ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు మునిరామ్ రెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచప్రఖ్యాతి గాంచిన తిరుమల శ్రీవారి భక్తులు ప్రతిరోజూ తిరుచానూరును సందర్శిస్తారని, ఇక్కడ జరిగే చిన్న ఘటన కూడా సోషల్ మీడియాలో నిమిషాల్లో ప్రపంచవ్యాప్తమవుతుందని, తిరుపతి ప్రతిష్టకు మచ్చ తగలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 10న మహతీ ఆడిటోరియంలో బ్రహ్మో త్సవాలు విజయవంతంగా ముగిసినందుకు జరిగిన సమావేశంలో టిటిడి ఈవో, జిల్లా ఎస్పీసహా ఉన్నతాధికారులు అన్ని విభాగాలు సమర్థంగా పనిచేశాయని, మీడియా పాత్ర కూడా కీలకం అని. మీడియా ప్రతినిధులు కూడా ఏవైనా సలహా సూచనలు చేయాలని కోరగా, తాను తిరుమలతోపాటు తిరుచానూరులో కూడా గతంలో బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తుల పట్ల విజిలెన్స్,పోలీస్ సిబ్బంది దురుసుగా,అసభ్య ప్రవర్తన గురించి గుర్తు చేయడంతో, స్పందించిన ఈవో ఎలాంటివి జరగకుండా చూస్తామని, హామీ ఇచ్చిన తర్వాత మూడు రోజుల్లోనే అమ్మవారి ఆలయంలో మహిళా జమేదార్ ఓ భక్తురాలిపై దాడి చేయడం జరిగిం దన్నారు. 4వ రోజు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో కూడా ఏకంగా బెదిరించి దాడిచేసే వరకు ప్రయత్నం చేశారు. తిరుచానూరు సి.ఐ ఒక స్థానిక కూటమి నాయకుడిని, మీడియా ప్రతినిధిని అవమానకరంగా దూషించారని, సీసీ కెమె రాల్లో మొత్తం రికార్డ్ అవుతుందని. తాను ప్రశ్నించగా "నీ వల్లయింది చేసుకో, రాసుకో" అంటూ సి.ఐ దురుసుగా ప్రవర్తించాడని ,ఒక సామాన్య ప్రజల పరిస్తితి ఏమిటో మీరు అర్థం చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత కొన్నాళ్లముందు ఈ సి.ఐ అన్యమతస్తుడు కావడంతో ఆలయ ధ్వంసాలకు సహక రిస్తున్నాడని, ఆస్ట్రేలియా నుంచి ఓఎన్ఆర్ఐ జనసేన నాయకుడు ఈ సిఐ భూ కబ్జాలకు చేస్తున్నాడని.. వీడియో విడుదల చేశారని ఇవన్నీ వైరల్ కావడం మీడియా మిత్రులు మీరు చూసారు కదా, ఇలాంటి ఎన్నో ఆరోపణున్న ఈ అధి కారిని ప్రజలు అంగీకరించడం లేదని, రాజకీయ అండతో ఇక్కడ కొనసాగుతు న్నారని, వెంటనే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మునిరామ్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో అమ్మవారి ఆలయంలో కూడా ఒక సూపరింటెం డెంట్ ఓభక్తురాలిపై అసభ్యకారంగా ప్రవర్తిస్తే పెద్దఎత్తున విమర్శలు వెల్లు వెత్తినా.. వివిధ పత్రికలు,హిందూ సంఘాలు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు, కాబట్టే అధికారులు,సిబ్బందికి భక్తుల పట్ల, ప్రజల పట్ల భయం,భక్తి లేకుండా మితిమీరి ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే ఇలాంటివి పునరావృతం కాకుండా, తిరుచానూరు పవిత్రత కాపాడాలని,,సి.ఐ తనపై కక్షకట్టి ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, తానుప్రాణహానికి గురయ్యేఅవకాశం ఉందని...త్వరలో టిటిడిఈవో, జిల్లాఎస్పీ, అవసరమైతే హిందూ సంఘాలతో కలిసి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని, పోరాటానికి సిద్ధమని మునిరామ్ రెడ్డి హెచ్చరించారు.

## పీజీఆర్ఎస్ రద్దు

**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 19:** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), డయల్ యువర్ కమిషనర్ దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సోమవారం మాత్రం దీపావళి సందర్భంగా రద్దు చేస్తున్నామని, వచ్చే సోమవారం యాదావిధిగా ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తామని తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854